క్లుప్తంగా

ఈశ్వరునికి ఘనంగా అన్నాభిషేకం

రొంపిచెర్ల: మండల కేంద్రమైన రొంపిచెర్ల సమీపంలోని కట్ట కింద శివాలయంలో సోమవారం ఈశ్వరునికి అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు మునిరాజశర్మ వేద మంత్రాలతో అన్నాభిషేకం, పంచామృతాభిషేకాలు, అభిషేకం వంటి పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. ఐదు సోమవారాలు అన్నాభిషేకం చేస్తే ఆ కుటుంబానికి ఎంతో మేలు జరుగుతుందని అర్చకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉభయదారులుగా వారణాసివారిపల్లెకు చెందిన శ్రీనివాసులు, రజిత దంపతులు వ్యవహరించారు.

శరవేగంగా రామభజన మందిర నిర్మాణం

వి.కోట: పట్టణంలోని నడిఒడ్డున వెలసిన శ్రీరామ ఆలయ ప్రాంగణంలో భజన మందిరం నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మండలంలోని రామభక్తులు తమ సొంత నిధులతో భజన మందిరాన్ని నిర్మించాలని కంకణం కట్టుకున్నారు. ఇందుకు దాదాపు రూ.60 లక్షలతో పనులు ప్రారంభించారు. ఆంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి దాతలు చందాల రూపంలో ఆర్థిక సాయాన్ని అందించాలని కోరారు.

మహాభారత యజ్ఞం ప్రారంభం

సదుం: మండలంలోని భట్టువారిపల్లె భారతం మిట్ట వద్ద సోమవారం పెద్దిరెడ్డి భాస్కర్ రెడ్డి ట్రస్ట్ ఆధ్వర్యంలో మహాభారత యజ్ఞం ఘనంగా ప్రారంభమైంది. కంకణధారులు బాబు రెడ్డి, మల్‌రెడ్డి దంపతుల ఆధ్వర్యంలో పాండవుల విగ్రహాలకు పూజలు నిర్వహించారు. ఇందులో పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని ధ్వజారోహణం చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సోమశేఖర్ రెడ్డి, కృష్ణారెడ్డి, రామాంజులు, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

పోలీస్‌శాఖకు డ్రోన్ కెమెరా బహూకరణ



పలమనేరు: పట్టణానికి చెందిన మదర్ థెరీసా కళాశాల యాజమాన్యం సోమవారం రూ.1.5 లక్షల విలువజేసే డ్రోన్ కెమెరాను స్థానిక డీఎస్పీ డేరంగుల ప్రభాకర్‌కు అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులకు ఉపయోగంగా ఉంటుందని డ్రోన్‌ను అందజేసినట్టు కళాశాల నిర్వాహకులు రవీంద్ర బాబు, సునీల్, రాజేంద్రరెడ్డి తెలిపారు. దాతలను డీఎస్పీ అభినందించారు. ఇందులో గంగవరం సీఐ ప్రసాద్ పాల్గొన్నారు.

చీకలచేనులో పర్యటించిన మంత్రి

సదుం: జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డి సోమవారం సదుం మండలంలోని చీకలచేనులో పర్యటించారు. సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచిపెట్టారు. సమస్యలు పరిష్కరిస్తామన్నారు. అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఇద్దరికి తీవ్ర గాయాలు

పుంగనూరు(చౌడేపల్లె): పుంగనూరు మండలం ఆరడిగుంట పంచాయతీ బోడబండ వద్ద ఆదివారం రాత్రి బైక్ ఢీకొనడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికుల కథనం మేరకు.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన వలస కార్మికుడు గణశ్యామ్(30) స్థానిక పైపుల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. అతను విధులు ముగించుకుని పుంగనూరుకు నడిచి వెళ్తున్నాడు. బోడబండ వద్ద పుంగనూరుకు బైక్‌లో వెళ్తున్న అమర్ సాగర్ (26) ఢీకొన్నాడు. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వారిని స్థానికులు 108లో పుంగనూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యులు తిరుపతికి రెఫర్ చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పెన్షన్ వ్యాలిడేషన్ సవరణను రద్దు చేయాలి

పలమనేరు: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తామంటున్న పెన్షన్ వ్యాలిడేషన్ సవరణను రద్దు చేయాలని పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రత్నారెడ్డి కోరారు. స్థానిక సంఘం కార్యాలయంలో సోమవారం సభ్యుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఈ బిల్లు వల్ల రిటైర్డ్ ఉద్యోగులకు నష్టం జరుగుతుందన్నారు. దీనిపై ఈ నెల 15న జిల్లా కేంద్రాల్లో నిరసన తెలపనున్నట్టు తెలిపారు.

వ్యక్తిపై కత్తితో దాడి

పుంగనూరు(చౌడేపల్లె): మామిడితోటలో మద్యం తాగవద్దని చెప్పినందుకు వ్యక్తిపై కత్తితో దాడి చేశారు. పుంగనూరు పట్టణంలోని మేలుపట్ల వద్ద ఓ రైతుకు చెందిన మామిడి తోటలో ఆదివారం రాత్రి గ్రామానికి చెందిన ప్రసన్నకుమార్ అతని స్నేహితులు కిషోర్, పవన్ మద్యం సేవించడానికి వెళ్లారు. మామిడి తోటలో మద్యం సేవించవద్దని కాపాలాదారు నారాయణ వారికి చెప్పారు. ఆగ్రహించిన యువకులు నారాయణపై కత్తితో దాడి చేశారు. అతన్ని కుటుంబ సభ్యులు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అలాగే మేలుపట్లకి చెందిన ప్రసన్నకుమార్ ఫిర్యాదు మేరకు ఇరువర్గాలపై కేసు నమోదుచేశారని ఎస్‌ఐ కేవీ రమణ తెలిపారు.

అయోమయంలో దుకాణదారులు

పార్కు అభివృద్ధి పేరుతో చిరువ్యాపారుల దుకాణాల తొలగింపునకు అధికారులు చర్యలు చేపట్టారు. 40 ఏళ్లుగా ఇక్కడే ఉంటూ జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలని వారు వాపోతున్నారు. ఏదైనా పనిచేస్తే పది మందికి అనుకూలంగా ఉండేలా చూడాలని, ఇలా జీవనంపై దెబ్బ కొట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అధికారులు, పాలకులు స్పందించి తమకు జీవనాధారం కల్పించాలని వారు కోరుతున్నారు.



అయోమయంలో పార్కు దుకాణాలు



పార్కు మధ్యలో వున్న వెంకటపతి రాజావారి స్తూపం

- పార్కు అభివృద్ధి పేరుతో దుకాణాల తొలగింపు
- 40 ఏళ్లుగా దుకాణాలతో జీవనం
- దిక్కుతోచని స్థితిలో చిరుద్యోగులు

కుప్పం: కుప్పం పట్టణ నడిబొడ్డున బస్టాండు ప్రాంగణంలో వెంకటపతి రాజావారి పార్కు వుంది. దీన్ని 1914లో ఏర్పాటు చేశారు. పార్కును ఆనుకుని రోడ్డు వైపునకు అధికారులు గతంలో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించారు. అందులో సుమారు 50కి పైగా దుకాణాలు వున్నాయి. వాటిని నమ్ముకుని ఎంతోమంది జీవనం సాగిస్తున్నారు. ప్రస్తుతం మున్సిపల్ అధికారులు పార్కు అభివృద్ధి పేరుతో దుకాణాలను తొలగించేందుకు రంగం సిద్ధం చేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రజల నుంచి అభిప్రాయాలు సేకరిస్తున్నారు. సుమారు రూ.100 కోట్లతో ఆధునిక వసతులతో సుందరంగా పార్కును తీర్చిదిద్దుతామని పేర్కొంటున్నారు. ఈ క్రమంలో పార్కులో ప్రస్తుతమున్న పిల్లల ఆట వస్తువులు, కమ్యూనిటీ భవనాలతోపాటు చెట్లను తొలగించాలని నిర్ణయించారు. రోడ్డుకు సమానంగా ఎత్తు పెంచి పచ్చదనం పెంపొందించేలా చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు.

దిక్కుతోచని స్థితిలో దుకాణదారులు

పార్కును అభివృద్ధి చేయాలంటే అక్కడున్న 50 దుకాణాల కాంప్లెక్స్‌ను పడగొట్టాలి. అప్పుడు కానీ పార్కు అభివృద్ధి సాధ్యం కాదు. ఈ దుకాణాల సముదాయాన్ని పడగొడితే సుమారు 200 కుటుంబాల వరకు వీధిన పడే అవకాశం ఉంది. తాము 40 ఏళ్లుగా పూలు, పండ్ల దుకాణాలతోపాటు చిల్లర దుకాణాలు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నామని, ఇప్పుడు దుకాణాలను తొలగిస్తే ఎక్కడికి పోవాలని వ్యాపారులు వాపోతున్నారు. గతంలో మేజర్ పంచాయతీగా ఉన్నప్పుడు పంచాయతీ కాంప్లెక్స్ నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. అప్పట్లో దుకాణదారులు కోర్టును ఆశ్రయించడంతో కాంప్లెక్స్ నిర్మాణం ఆగిపోయింది. అంతేగాక ఆ పార్కు స్థలాన్ని తమకే చెందేలా తీర్పు ఇవ్వాలని జమిందార్ల వంశస్తులు కోర్టు మెట్లు ఎక్కారు. ఈ కేసుల విచారణ కొన్నేళ్లపాటు కొనసాగింది. పార్కు స్థలం పంచాయతీకే చెందుతుందని కోర్టు తీర్పు ఇచ్చింది. దుకాణాలను తొలగించవద్దని కూడా దేశించింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం పార్కు దుకాణాల సమస్యను తీసుకువచ్చింది. ఈ విషయం మళ్లీ చర్చనీయాంశమైంది.

జగన్ పర్యటనను విజయవంతం చేద్దాం

పులిచెర్ల(కల్లూరు): మామిడి రైతుల సమస్యలను తెలుసుకుని పరిష్కారం కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9వ తేదీన బంగారుపాళెం వస్తున్నారని ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాథమునిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్ బాషా తెలిపారు. మండలం నుంచి అధిక సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలివెళ్లి ఆయన పర్యటనను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు.

పుంగనూరు(చౌడేపల్లె): మామిడి రైతుల సమస్యలు తెలుసుకునేందుకు ఈ నెల 9వ తేదీన బంగారుపాళెం వస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేద్దామని ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఆయన సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచులు, ఎంపీటీసీలతో సమావేశమయ్యారు. కార్యక్రమంలో పీకేఎం ఉడా మాజీ చైర్మన్ వెంకటరెడ్డి యాదవ్, పార్టీ మండల అధ్యక్షుడు అమరనాథరెడ్డి, అధికార ప్రతినిధి రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు అభివృద్ధిలో వైఎస్సార్ ముద్ర





పలమనేరు మండలంలోని వైఎస్సార్ జలాశయం(ఫైల్), పలమనేరులో జరిగిన ప్రజాపథం బహిరంగ సభకు హాజరైన వైఎస్ రాజశేఖరరెడ్డి(ఫైల్)

- ప్రజల దాహార్తి తీర్చిన వైనం
- కౌండిన్య ప్రాజెక్టుకు వైఎస్సార్ జలాశయంగా పేరు

పలమనేరు: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర రెడ్డి పలమనేరు నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రత్యేక చొరవ తీసుకున్నారు. ఆయన హయాంలో జరిగిన అభివృద్ధి ప్రజలు ఇప్పటికీ మరిచిపోలేదు. పట్టణవాసుల దాహార్తిని తీర్చేందుకు రూ.52 కోట్లతో మండలంలోని కాలువపల్లి సమీపంలో కౌండిన్య రిజర్వాయర్‌ను నిర్మించిన ఘనత ఆమహానుభావుడికే దక్కుతుందని స్థానికులు చెబుతున్నారు. ఈ జలాశయాన్ని చూసినప్పుడల్లా మహానేత గుర్తుకు వస్తున్నాడని పేర్కొన్నారు. అందుకే ఆ ప్రాజెక్టుకు వైఎస్సార్ జలాశయంగా పేరు పెట్టినట్టు చెబుతున్నారు. అలాగే నియోజకవర్గంలో రూ.150 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టారు. పలమనేరంటే తనకు ప్రత్యేక అభిమానమని, ఇక్కడ జరిగిన ప్రజాపథంలో వైఎస్సార్ తెలిపి అభిమానాన్ని చాటుకున్నారు. అందుకే ఈ ప్రాంతవాసులు జననేతను తమ గుండెల్లో పెట్టుకుని ఆరాధిస్తున్నారు. పలమనేరు మున్సిపాలిటీ భవనం కోసం రూ.కోటి మంజూరు చేశారు. నేడు పట్టణంలో అందంగా కనిపిస్తున్న మున్సిపల్ భవనాన్ని చూసినప్పుడల్లా ప్రజాప్రతినిధులు వైఎస్‌ను తలచుకుంటారు. అదే విధంగా పలమనేరు నియోజకవర్గాన్ని పారిశ్రామిక రంగంలో కూడా అభివృద్ధి చేసేందుకు రూ.16 కోట్లతో 632 ఎకరాల్లో గంగవరం మండలంలోని గంట్రాజుపల్లి వద్ద సెజ్‌ల నిర్మాణాన్ని చేపట్టారు. ఇలా పలమనేరు అభివృద్ధికి ఆయన చేసిన కృషి ఎంతో వుందని స్థానికులు చెబుతున్నారు.



పలమనేరు మున్సిపల్ భవనం

నేడు వైఎస్సార్ జయంతి వేడుకలు

పులిచెర్ల(కల్లూరు): మండల కేంద్రమైన పులిచర్లలో మంగళవారం నిర్వహించనున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకల్లో మాజీ మంత్రి, పుంగనూరు శాసన సభ్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొనున్నట్టు ఎంపీపీ సురేంద్రనాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నాథమునిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి ముర్వత్ బాషా తెలిపారు. ఆయన దివంగత ముఖ్యమంత్రి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తారని పేర్కొన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

నేడు చౌడేపల్లెలో వైఎస్సార్ జయంతి వేడుకలు

చౌడేపల్లె: స్థానిక బస్టాండు కూడలిలోవున్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహం వద్ద ఆయన జయంతి వేడుకలను మంగళవారం ఉదయం 9 గంటలకు నిర్వహించనున్నట్టు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దామోదరరాజు, పార్టీ మండల కన్వీనర్ నాగభూషణరెడ్డి తెలిపారు. అదేవిధంగా సోమల బస్టాండు కూడలిలోని వైఎస్సార్ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహిస్తున్నామని పార్టీ మండల కన్వీనర్ మత్యం గంగాధరం తెలిపారు.

చిచ్చిలివారిపల్లెలో..

రొంపిచెర్ల: మండలంలోని చిచ్చిలివారిపల్లెలో మంగళవారం మహానేత వైఎస్.రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కరీముల్లా తెలిపారు. ఇందులో వైఎస్సార్‌సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేడు మహానేతకు నివాళి

పలమనేరు: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా పట్టణంలోని మార్కెట్ కమిటీ వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించే కార్యక్రమం మంగళవారం ఉదయం పది గంటలకు నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ హేమంత్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఇందులో మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. పేదలకు అన్నదానం చేస్తామని వెల్లడించారు. అదేవిధంగా మండలంలోని కొలమాసనపల్లి, నక్కపల్లి గ్రామాల్లోనూ వైఎస్సార్ జయంతిని నిర్వహించనున్నట్టు రూరల్ మండల నాయకులు తెలిపారు.

పుంగనూరులో..

పుంగనూరు (చౌడేపల్లె): పుంగనూరు పట్టణంలోని ప్రయివేటు బస్టాండులో మంగళవారం ఉదయం 9.30 గంటలకు వైఎస్సార్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ అలీమ్ బాషా తెలిపారు. ఈమేరకు ఏర్పాట్లు చేశామన్నారు.

పీహెచ్‌సీలను తనిఖీ చేసిన అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

పలమనేరు: పలమనేరు మండలంలోని పీహెచ్‌సీలను సోమవారం ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీలు చేశారు. కొలమాసనపల్లి ఆరోగ్య కేంద్రంలో సబ్‌యూనిట్ అధికారి జయశంకర్ ల్యాబ్ టెక్నీషియన్ రికార్డులను పరిశీలించి పలు సూచనలను చేశారు. ప్రబలిన జ్వరాలు అనే శీర్షికన సోమవారం సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనంపై ఆయన స్పందించారు. జ్వరాలు వచ్చిన రోగులు ఆస్పత్రికి రాగానే వారి నుంచి రక్త నమూనాలు సేకరించి ఫలితాల మేరకు చికిత్స చేయాలని ఆదేశించారు. మలేరియా జ్వరం పాజిటివ్ వచ్చిన రోగుల వివరాలను మెడికల్ ఆఫీసర్‌కు తెలపాలన్నారు. ల్యాబ్‌లలో పరీక్షలు నిర్వహించకుండా నిర్లక్ష్యం చేస్తే ఉన్నతాధికారుల నుంచి చర్యలు తప్పవని ఆయన సూచించారు. జ్వరాలపై గ్రామాల్లోని ఏఎన్ఎంలు, ఆశాలు సైతం అప్రమత్తంగా ఉండాలని ఆయన ఆదేశించారు.



కొలమాసనపల్లి పీహెచ్‌సీలో ల్యాబ్ టెక్నీషియన్ రికార్డులను పరిశీలిస్తున్న సబ్ యూనిట్‌అధికారి

భగవద్గీత పఠనం ఎంతో అవసరం



ప్రచార కార్యక్రమంలో ప్రభోదసేవా సమితి సభ్యులు

వి.కోట: శ్రీ కృష్ణ పరమాత్మ అందించిన భగవద్గీత పఠనం చేయాల్సిన అవసరం ప్రస్తుతం ఎంతో వుందని ప్రభోద సేవా సమితి సభ్యులు తెలిపారు. ఈ నెల 10వ తేదీన గురుపౌర్ణమి సందర్భంగా శ్రీకృష్ణ భగవానుడికే పూజలు చేయాలన్నారు. వారు సోమవారం మండలంలోని నాయకనేరి, నడమంత్రం గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత, అనుబంధ గ్రంథాలపై ప్రచారం చేశారు. ప్రజలకు భగవద్గీత పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సభ్యులు అశోక్‌బాబు, ఝాన్సీ, గౌతమ్, ఉదయ్, హేమతేజశ్విని, సుస్మిత తదితరులు పాల్గొన్నారు.

కొంతమందికే తల్లికి వందనం



బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటేగౌడ

- హామీలకు లేదు ష్యూరిటీ
- మాజీ ఎమ్మెల్యే ఎన్.వెంకటేగౌడ

బైరెడ్డిపల్లె: పాఠశాలకు వెళ్లే ప్రతి విద్యార్థికీ తల్లికి వందనం పథకం ద్వారా రూ.15 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు కొంతమందికే పథకాన్ని అమలు చేసిందని మాజీ ఎమ్మెల్యే ఎస్.వెంకటేగౌడ ఆరోపించారు. ఆయన సోమవారం బైరెడ్డిపల్లెలోని ఓ కల్యాణ మండపంలో బాబు ష్యూరిటీ మోసం గ్యారెంటీ క్యూఆర్ కోడ్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ అబద్ధాలు, మోసాలు, వెన్నుపోటు వంటివి చంద్రబాబుకు వెన్నెతో పెట్టిన విద్య అని విమర్శించారు. అధికారం కోసం ఎన్ని అబద్ధాలైనా చెబుతారని మండిపడ్డారు. కూటమి ఎమ్మెల్యేలు అడవులు, గుట్టలను తవ్వి ఇతర రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారని మండిపడ్డారు. మామిడి రైతులు గిట్టుబాటు ధరలేక, పండిన పంటను తరలించలేక నెల రోజులకు పైగా తల్లడిల్లుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఏమీ పట్టనట్టు మొహం చాటేయండం దారుణమన్నారు. చంద్రబాబు ఏడాది పాలన అంతా రెడ్‌బుక్ రాజ్యాంగం ప్రకారం నడిచిందన్నారు. వైఎస్సార్ సీపీ సానుభూతిపరులను టార్గెట్ చేసి అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. మహిళలు, చిన్నారులపై రాష్ట్ర వ్యాప్తంగా అఘాయిత్యాలు పెరిగాయని దుయ్యబట్టారు. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని, కూటమి ప్రభుత్వం చేస్తున్న తప్పులను ప్రశ్నిస్తూనే ఉంటామని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను వంద శాతం నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ నెల 9న బంగారుపాళ్యంకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప, జెడ్పీటీసీ ఆర్.కేశవులు, రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లె క్రిష్ణమూర్తి, సంయుక్త కార్యదర్శి దయానందగౌడు, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కార్తీక్, ఉపాధ్యక్షుడు గిరిప్రసాద్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

మత్తుతో జీవితాలు నాశనం

పుంగనూరు(చౌడేపల్లె): యువత మత్తు పదార్థాలకు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని శుభారాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్ తెలిపారు. కళాశాలలో సోమవారం మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ మత్తు బారిన పడితే జీవితాలు నాశనం అవుతాయన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కళాశాలలో పోకిరీలు ఇబ్బందులకు గురి చేసినా, లైంగిక వేధింపులకు పాల్పడినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు సోమరాజు, అనీల్‌కుమార్, ఆంజనేయరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మత్తు పదార్థాల వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

అర్జీలను సకాలంలో పరిష్కరించండి



అర్జీలు స్వీకరిస్తున్న కడా పీడీ

కుప్పం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కడా పీడీ వికాస్ మర్మత్ ఆదేశించారు. ఆయన సోమవారం మండల సచివాలయంలో గ్రీవెన్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ పరిధిలో 41 అర్జీలు వచ్చాయి. అనంతరం అధికారులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యల పరిష్కార వేదికలో రోజు రోజుకూ ఫిర్యాదుల సంఖ్య పెరుగుతోందన్నారు. అధికారులు నిత్యం గంట సమయం కేటాయించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. సమస్యలు పరిష్కరించి పరిష్కార వేదిక పట్ల నమ్మకం కలిగించాలని సూచించారు.

సంక్షేమ హాస్టళ్ల తనిఖీ

పుంగనూరు(చౌడేపల్లె): పట్టణంలోని బాలురు, బాలికలు, గిరిజన, కాలేజ్ సాంఘీక సంక్షేమ శాఖ హాస్టళ్లను సోమవారం జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు డాక్టర్ బాణావత్ మునీంద్రనాయక్ తనిఖీ చేశారు. పనులను పరిశీలించారు. విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనపై ఆరా తీశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా వున్న హాస్టళ్లలో రూ.13 కోట్లతో రీమోల్డింగ్ పనులు చేస్తున్నట్టు తెలిపారు. తమ పరిశీలనలో గుర్తించిన విషయాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి విద్యార్థుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో అయూబ్‌ఖాన్, శ్రీరాములునాయక్, అధికారులు పాల్గొన్నారు.



పుంగనూరులో హాస్టల్ పనులను పరిశీలిస్తున్న మునీంద్రనాయక్

చిన్నారులకు అక్షరాభ్యాసం

బైరెడ్డిపల్లె: మండలంలోని నెల్లిపట్ల ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులకు అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం పాఠశాలలో శ్రీ సరస్వతీ దేవి పూజ చేపట్టి విద్యార్థులతో హెచ్‌ఎం సురేఖ అక్షరాలు దిద్దించారు. విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని, ఉపాధ్యాయులు నేర్పిన పాఠాలను ఎప్పటికప్పుడు పూర్తి చేయాలన్నారు.



అక్షరాభ్యాసం చేయిస్తున్న హెచ్‌ఎం సురేఖ

మా పొలాలకు దారి చూపండి

- అధికార పార్టీ రైతు పొలానికి దారి కల్పించిన తహసీల్దార్
- బాధిత రైతుల గురించి పట్టించుకోని వైనం
- ఆందోళనకు దిగిన రైతులు

గంగవరం: టీడీపీ కూటమి ప్రభుత్వంలో అర్హులకు న్యాయం జరగడం లేదని, వారి కార్యకర్తలు, నాయకులకే అధికారులు పనులు చేసి పెడుతున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. పొలాల్లోకి వెళ్లేందుకు దారి లేక ఇబ్బందులు పడుతున్నామని పలుమార్లు అధికారులను కలిసి విన్నవించినా పట్టించుకోలేదని, అదే కూటమి సానుభూతిపరుడైన రైతుకు వెంటనే దారి సౌకర్యం కల్పించారని మండిపడుతున్నారు. వివరాల్లోకి వెళితే.. గంగవరం మండలంలోని కీలపట్ల పంచాయతీ జరావారిపల్లి గ్రామంలో రైతుల పొలాల వద్దకు వెళ్లేందుకు దారి లేక కొన్నేళ్ల నుంచి ఇబ్బంది పడుతున్నారు. ఈ మధ్య రైతులందరూ తమ పొలాలకు దారి సౌకర్యం కల్పించాలంటూ తహసీల్దార్‌కు విన్నవించుకున్నారు. అయినా పట్టించుకోలేదు. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు వీరభద్ర పొలానికి సైతం ఇక్కడే దారి సమస్య ఉంది. తన సమస్యను వెంటనే పరిష్కరించాలంటూ అధికార పార్టీ పెద్దల నుంచి తహసీల్దార్‌కు ఫోన్ చేయించాడు. ఈ క్రమంలో తహసీల్దార్ మాధవరాజు, కార్యాలయ సిబ్బంది, పోలీసులు ఆగమేఘాల మీద ఆ రైతు పొలానికి దారి కల్పించేందుకు జరావారిపల్లికి చేరుకున్నారు. ఆ రైతు సమస్యను మాత్రమే పరిష్కరించి ఏళ్ల తరబడి ఇబ్బంది పడుతున్న ఇతర రైతుల గురించి పట్టించుకోలేదు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు. దారి ప్రారంభంలో వచ్చే రైతు రామక్రిష్ణ భూమిని కొంత బలవంతంగా లాక్కుని జేసీబీతో తవ్వకాలు చేసి వీరభద్ర పొలానికి దారి చూపించి రెవెన్యూ అధికారులు ద్వంద్వ వైఖరి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. అదే విధంగా ఇదే దారిలోనే నూతనంగా వెలసిన వీరభద్రస్వామి ఆలయానికి సైతం చేరుకోవాల్సి ఉంది. బాధిత రైతులతో పాటు దేవుని ఆలయానికి కూడా దారి సమస్య ఉన్నా తమకు పట్టనట్టు అధికారుల వ్యవహరించడం సరికాదన్నారు. అధికార బలంతో సమస్యను పరిష్కరించుకున్న టీడీపీ నాయకుడి భూమి నుంచి దాదాపు 50 మందికి పైగా రైతులు తమ వ్యవసాయ పొలాల వద్దకు వెళ్లాల్సి ఉంది. దీనిపై తహసీల్దార్ పట్టించుకోకపోవడం దారుణమని దుయ్యబట్టారు. ఈ క్రమంలో రైతులు, రెవెన్యూ సిబ్బంది మధ్య కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. పేదల పక్షాన నిలబడాల్సిన పాలక పక్షం తమ వారి వరకే చూసుకుంటున్నారని, అందరికీ న్యాయం చేయడం లేదని రైతులు వాపోతున్నారు.



దారి ఏర్పాటు చేయాలని అధికారులను ప్రశ్నిస్తున్న బాధిత రైతులు